




వినుకొండ : తాళాలు వేసి ఉన్న నరగాయపాలెం సచివాలయం

డబ్బులు లేవు పింఛన్ లేదు



డబ్బులు లేవు.. పింఛన్ ఇవ్వలేము. నగదు రాకుంటే మేమేమి చేస్తాం.. ఇదీ తొలి రోజు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ తీరు. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయలేదు. అయినా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వృద్ధులు ఎంతో ఆశతో అష్ట కష్టాలు పడి సచివాలయాలకు వస్తే సిబ్బంది సమాధానంతో నిరాశకు గురయ్యారు. ఉదయం.. మధ్యాహ్నం.. సాయంత్రం అంటూ వృద్ధులను చాలా చోట్ల సచివాలయాల సిబ్బంది తిప్పుకున్నారు. కొన్ని దగ్గర్ల అయితే వృద్ధులు, దివ్యాంగులు సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వయోవృద్ధులు, దివ్యాంగులు ఉదయం 7 గంటల నుంచే సచివాలయాల వద్దకు చేరుకున్నా కొన్ని దగ్గర్ల రాత్రి వరకు వారికి పింఛన్ ఇవ్వలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మూడొంతుల సచివాలయాల్లో ఇదే పరిస్థితి. తొలిరోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నూటికి ముగ్గురికి కూడా పింఛను అందలేదంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. అయితే ప్రభుత్వం కావాలని వృద్ధులకు పడిగాపుల శిక్ష విధించిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

- సచివాలయాల ఖాతాలకు జమకాని నగదు
- డబ్బులు రాకుంటే మేమేమి చేస్తామన్న సిబ్బంది
- పలు సచివాలయాల్లో ప్రారంభమేకాని పంపిణీ
- మూడు జిల్లాల్లో 25 శాతం మందికే పింఛన్లు..
- వృద్ధులకు పడిగాపుల శిక్షపై ప్రతిపక్షాల ఆగ్రహం

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ.. పింఛన్ల పంపిణీని అధికార పార్టీ రాజకీయ అస్త్రంగా ఉపయోగించు కుంటుందా అంటే.. బుధవారం నాటి పరిస్థితులు అవునంటున్నాయి. మండే ఎండల్లో వృద్ధులు, దివ్యాంగులు, రోగులు సచివాలయాలకు రాలేరని తెలిసి కూడా వారితో ప్రభుత్వం ఆడుకుంది. అష్టకష్టాలు పడి సచివాలయాలకు వచ్చినా పింఛన్ ఇవ్వకుండా పడిగాపుల శిక్ష వేసింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఇస్తున్న పింఛన్‌ను ఏప్రిల్‌లో రకరకాల కారణాలు చెప్పి మూడో తేదీకి వాయిదా వేసిన ప్రభుత్వం, ఆ రోజు కూడా వృద్ధులకు చుక్కలు చూపించింది. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయకుండా పింఛన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మెజారిటీ సచివాలయాల్లో మధ్యాహ్నం వరకూ పింఛన్ల పంపిణీ ప్రారంభమే కాలేదు. ఒక్కో మండల పరిధిలో సగటున 15 సచివాలయాలు ఉంటే 3, 4 సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నిధులు పడ్డాయి. వాస్తవానికి ఆ నిధులు ముందురోజే సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా ప్రభుత్వం వాటిని మంజూరు చేయలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు పింఛను పంపిణీపై చేతులెత్తేశారు. సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సమాధానం చెప్పలేక సిబ్బంది బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి మరికొన్ని బ్యాంకుల్లో నిధులు జమవడంతో కొన్ని దగ్గర్ల పింఛన్ల పంపిణీ జరిగింది. మున్సిపాలిటీల్లో కొన్ని సచివాలయాలు, పలు మండల కేంద్రాల్లో కొన్నిదగ్గర్ల మాత్రమే అరకొరగా పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్ల సేవలున్నప్పుడు ప్రభుత్వం ఒకే రోజున నగదు మొత్తాన్ని విడుదల చేసేది. అలాంటిది ఇప్పుడు అరకొరగా విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ప్రతిపక్షాలపై పింఛన్‌దారుల్లో వ్యతిరేకత ఏర్పరచడమే దీని ఉద్దేశమన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా కొన్ని సచివాలయాల వద్ద వైసీపీ నాయకులు మకాం వేసి టీడీపీ వల్లే ఈ ఇబ్బందులన్న రీతిలో ప్రచారం చేయించే ప్రయత్నం చేశారు. దీనిని పసిగట్టిన సచివాలయాల సెక్రెటరీలు సెక్రెటేరియట్ల కాంపౌండ్లలో పింఛన్‌దారులు మినహా మరెవరూ ఉండటానికి వీల్లేదని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో వారు జారుకున్నారు.



తెనాలిలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పింఛన్ల పంపిణీ చేస్తామని యంత్రాంగం చెప్పడంతో వేచి ఉన్న వృద్ధులు

వృద్ధులకు శిక్ష.. ప్రభుత్వ కుట్ర

పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనలేకుండా ఉంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, రోగులకు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, సచివాలయాల సిబ్బంది నేరుగా వచ్చి అందిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఏ సచివాలయ పరిధిలోనూ ఇది అమలు కాలేదు. అదేమంటే తమకు ఆదేశాలు అందలేదని సచివాలయాల సిబ్బంది చెప్పారు. నగదు కావాలంటే సచివాలయాలకు రావాల్సిందే అని సిబ్బంది సూచించారు. దీంతో అష్టకష్టాలు పడి పలువురు పింఛన్ కోసం సచివాలయాలకు వచ్చారు. ఎండలో సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. నగదు జమ కాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఖాతాల్లో నగదు జమకాలేదని, తామేమీ చెయ్యలేమంటూ సిబ్బంది తేల్చి చెప్పారు. దీంతో ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకు వేచి ఉన్న వారు విసిగిపోయి.. ఎండలో ఉండలేక ఇళ్లకు వెళ్లిపోయారు. రేపల్లెలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొన్ని సచివాలయాల్లో నగదు జమ కావటంతో పింఛన్ల పంపిణీని 4 గంటల సమయంలో ప్రారంభించారు. వేమూరు పరిధిలో చదలవాడ, వరహాపురం, కుచ్చెళ్ళపాడు, వెల్లబాడు, చావలి, పెరవలి, పెరవలిపాలెం, జంపని గ్రామాలకు నగదు అందడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు. కొల్లూరు మండలం అనంతవరం సచివాలయ పరిధిలో 432 పింఛన్లకు సంబంధించి రూ.12 లక్షల వరకు నగదు జమ కావాల్సి ఉండగా కేవలం రూ.25 వేలు మాత్రమే జమ చేశారు. దీంతో 75 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. దీనికి తోడు మధ్యమధ్యలో సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీకి అంతరాయం ఏర్పడింది. వినుకొండ పరిధిలోని నరగాయపాలెం సచివాలయానికి సిబ్బంది ఏకంగా తాళాలు వేసి వెళ్ళిపోయారు. దీంతో పింఛన్ కోసం వచ్చిన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో 700 పింఛన్లు ఉండగా సచివాలయంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండటంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. గుంటూరులో తొలిరోజు నగదు విడుదల కాకపోవడంతో 12 సచివాలయాల పరిధిలో పంపిణీనే ప్రారంభం కాలేదు. ప్రభుత్వం కుట్రతోనే తమకు పడిగాపుల శిక్ష విధించిందని పలువురు మండిపడ్డారు.

మధ్యాహ్నం వరకు 2.5 శాతమే..

బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకి మూడు జిల్లాల్లో పింఛన్ల పంపిణీ సగటున 2.5 శాతంగా ఉంది. గుంటూరు జిల్లాలో 2 లక్షల 61వేల మంది పింఛనుదారులు ఉండగా వారిలో 5,630 మందికి మాత్రమే మధ్యాహ్నానికి పింఛన్లు అందాయి. పల్నాడు జిల్లాలో 2లక్షల 82వేల మందిలో 5,369 మందికి, బాపట్ల జిల్లాలో 2 లక్షల 35వేల మందిలో 9,300 మందికి పింఛన్లు అందాయి. మధ్యాహ్నం నుంచి బ్యాంకుల్లో నిధులు జమ కావడం మొదలవడంతో పింఛన్ల పంపిణీ మొదలైంది. సాయంత్రానికి బాపట్ల జిల్లాలో 41.99 శాతం, గుంటూరు జిల్లాలో 41.61 శాతం, పల్నాడు జిల్లాలో 44.75 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. అరకొరగా నగదు విడుదలతో ఈ స్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగింది.

ప్రతిపక్షాలపై నెపం వేసేందుకేనా?

ఒకవైపు మండే ఎండలు.. మరోవైపు సచివాలయాలకు వస్తేనే పింఛన్ ఇస్తాం అని చెప్పి.. అష్టకష్టాలు పడి వచ్చిన వారికి నగదు అందజేయని ప్రభుత్వ తీరును చూసిన పలువురు అధికార పార్టీ కావాలని ఇదంతా చేస్తోందని ఆరోపిస్తున్నారు. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు సరిచేసుకోకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కావాలని ప్రతిపక్షాలపై నెపం వేసేందుకు బుధవారం నాటి పరిణామాలను ప్రభుత్వం సృష్టించిందన్న విమర్శలు వచ్చాయి. మధ్యాహ్నం వరకు కూడా పింఛన్ పంపిణీ జరగకపోవడం, లబ్ధిదారుల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేని సచివాలయ సిబ్బంది అసలు విషయం చెప్పేశారు. బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు.. అందువల్ల పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని చేతులెత్తేశారు. దీంతో లబ్ధిదారులకు అసలు విషయం బోధపడింది. దీంతో ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలు పటాపంచలైపోయాయి. ప్రభుత్వమే నిధులు మంజూరు చేయకుండా ఓట్ల నాటకానికి తెర తీసిందని పలువురు తెలుసుకున్నారు. నేరుగా తమ ఖాతాల్లో వేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం, అధికార వైసీపీనే తమను మండుటెండల్లో సచివాలయాల వద్ద పడిగాపులు పడేలా చేసిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చీరాల బరి చైతన్య ఝరి

నియోజకవర్గ ముఖచిత్రం

చీరాల పోరాటాల పురిటి గడ్డ. ఇక్కడి ప్రజలు చైతన్య వంతులు. ఉద్యమ నేపథ్యం వారి సొంతం. బ్రిటీష్ పాలకులు చీరాల, పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేస్తే వ్యతిరేకించారు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణ మహాత్మాగాంధీ సూచించిన మార్గాల్లో ఒకటైన పుర బహిష్కరణతో బ్రిటీష్ పాలకుల మెడలు వంచారు. నియోజక వర్గ పరిధిలోని వేటపాలేనికి చెందిన అలివేలు మంగతాయారు స్వాంతంత్రోద్యంలో పాల్గొన్న తొలి మహిళగా ప్రతీతి. లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బాపట్ల ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. ఈ జిల్లా పరిధిలోకి చీరాల అసెంబ్లీ నియోజక వర్గం వచ్చింది. ఈ క్రమంలో చీరాల నియోజక వర్గం గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..



కోటయ్య వెంకటేశ్వర్లు చంద్రమౌళి సాంబు రామారావు

- పోరాటాల పురుటిగడ్డ.. రాజకీయ చైతన్య దీపిక
- భిన్నత్వంలో ఏకత్వం ఇక్కడి ప్రత్యేకత
- ఓటరు తీర్పు విలక్షణం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిని అందించిన నియోజకవర్గం
- తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన డాక్టర్ కొణిజేటి రోశయ్య
- వస్త్రవ్యాపారానికి చినబొంబాయిగా ప్రసిద్ధి

చీరాల, ఏప్రిల్ 3: చీరాల నియోజకవర్గం ప్రజలు భిన్న మతాలు, కులాల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. పరస్పరం గౌరవించుకుంటారు. పరమత సహనం పాటిస్తారు. చీరాల నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడ్డవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. సుమారు 18 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరప్రాంతం ఉంది. మత్స్యకార గ్రామాల్లో వారి కట్టుబాట్లు వేరుగా ఉంటాయి.

ఓటరు తీర్పు విలక్షణం..

చీరాల నియోజకవర్గ ఓటరు తీర్పు విలక్షణంగా ఉంటుంది. చైతన్యవంతంగా ఆలోచిస్తారు. తమకు మే లు చేస్తారని ఓటు ద్వారా ఆశీర్వదిస్తారు. లేదంటే తిర స్కరిస్తారు. 1952లో నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు అం దుకు నిదర్శనంగా రాజకీయ పండితులు విశ్లేషి స్తుంటారు.

ఇప్పటి వరకు 16 పర్యాయాలు ఎన్నికలు

చీరాల నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 16 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1980లో ఒక పర్యాయం ఉపఎన్నిక జరిగింది.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ప్రగడ కోటయ్య	కేఎంపీపీ	యూయూ గుప్తా	ఇండి	8,231
1955	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	జేఎల్ నారాయణ	సీపీఐ	6,073
1962	జేఎల్ నారాయణ	సీపీఐ	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	5,054
1967	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	కొణిజేటి రోశయ్య	ఇండి	2,566
1972	జి.కోటయ్య	కాంగ్రెస్	సజ్జా చంద్రమౌళి	ఇండి	608
1978	ఎం.వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	సజ్జా చంద్రమౌళి	జనతాపార్టీ	1857
1980	సజ్జా చంద్రమౌళి	జనతా పార్టీ	బీఎస్పీ బండ్ల	కాంగ్రెస్(ఐ)	19,573
1983	చిమటా సాంబు	టీడీపీ	బీబీ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	33,687
1985	సజ్జా చంద్రమౌళి	టీడీపీ	అందె నరసింహారావు	కాంగ్రెస్(ఐ)	8,766
1989	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	చిమటా సాంబు	టీడీపీ	23,333
1994	పాలేటి రామారావు	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	3,606
1999	పాలేటి రామారావు	టీడీపీ	గోలి అంజలీదేవి	కాంగ్రెస్(ఐ)	13,508
2004	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	పాలేటి రామారావు	టీడీపీ	30,077
2009	ఆమంచి కృష్ణమోహన్	కాంగ్రెస్(ఐ)	జంజనం శ్రీనివాసరావు	టీడీపీ	11,286
2014	ఆమంచి కృష్ణమోహన్	నవోదయం	పోతుల సునీత	టీడీపీ	10,335
2019	కరణం బలరాం	టీడీపీ	ఆమంచి కృష్ణమోహన్	వైసీపీ	17,419

నియోజకవర్గం ఆవిర్భావం తొలినాళ్లలో ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు మండలంలో సింహభాగం చీరాల నియోజకవర్గంలో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తరువాత చీరాల పట్టణం, చీరాల, వేటపాలెం మండలాలతో నియోజకవర్గం రూపాంతరం చెందింది. ఈ నియోజకవర్గం నుంచి ప్రగడ కోటయ్య, సజ్జా చంద్రమౌళి, కొణిజేటి రోశయ్య, చిమటా సాంబు, డాక్టర్ పాలేటి రామారావు, ఆమంచి కృష్ణమోహన్‌లు పలుమార్లు పోటీచేశారు. గెలుపు, ఓటములను చవిచూశారు. 2019 ఎన్నికల్లో కరణం బలరామకృష్ణమూర్తి గెలుపొందారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా రోశయ్య

చీరాల నుంచి పలుమార్లు పోటీచేసి గెలుపు, ఓటములను చవిచూచిన డాక్టర్ కొణిజేటి రోశయ్య ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆ తరువాత తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాజకీయం నేపథ్యం నామమాత్రంగా కూడా లేని చిమటా సాంబు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలుపొంది సత్తాచాటారు. డాక్టర్ పాలేటి రామారావు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. వారివురు యాదవ సామాజికవర్గానికి చెందినవారు.

ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులు

టీడీపీ, జనసేన, బీజేపీ(ఎన్‌డీఏ) కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీకి తరపున ఎంఎం కొండయ్యను, వైసీపీ తరపున కరణం వెంకటేష్‌ను ఆయా పార్టీలు ప్రకటించాయి. కొండయ్య నియోజవర్గంలో తొలిసారిగా పోటీచేస్తున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత వైసీపీకి మద్దతు తెలిపారు. ఆయన కుమారుడు వెంకటేష్ పార్టీ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ బరిలో నిలిచారు. అభ్యర్థులిద్దరు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నియోజవకర్గ ఓటర్లు
2,00,332

పురుషులు
97,559

మహిళలు
1,02,750

ఇతరులు : 23



చీరాల పురపాలక సంఘ కార్యాలయం

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- పద్మశాలి : 29,000
- దేవాంగ : 26,000
- ఎస్సీ : 33,000
- (మాల 27,000,
- మాదిగ 6వేలు)
- యాదవ : 26,000
- వైశ్య : 22,000
- రెడ్డి : 11,500
- కాపు : 11,500
- ముస్లిం : 10,500
- మత్స్యకారులు : 9,000
- (పట్టపు, పల్లెకారులు) ఎస్టీ : 10,000 (ఎరుకుల, యానాది)
- కమ్మ : 4,000
- ఇతరులు : 8,000

జీతాల ఊసేది

- నరసరావుపేట మునిసిపాల్టీలో ఉద్యోగులకు ఆర్థిక వెతలు
- రెండు నెలలుగా జీతాలు చెల్లించని వైనం

నరసరావుపేట, ఏప్రిల్3: నరసరావుపేట మునిసిపాల్టీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. చివరకు కార్మికులు. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితికి చేరింది. జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండు నెలలుగా జీతాలు లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు జీతాల చెల్లింపు నిలిచిపోయింది. 3వ తేదీ గడిచినా జీతం అందక పోవడంతో సదరు ఉద్యోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జీతం చెల్లించమని మునిసిపల్ కమీషనర్ కోరుతున్నారు. ఈ ఉద్యోగులు 406 మంది దాకా ఉన్నారు.

ఆస్తిపన్ను పుష్కలంగా వసూలు అవుతున్నా జీతాల ఊసే ఎత్తకపోతుండటంతో సదరు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఆస్తి, నీటిపన్ను వసూలు మెరుగ్గా ఉంది. జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారన్న విమర్శలున్నాయి. జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడపై సదరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతాలకు ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే మిగులు నిధులను ప్రగతి పనులు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముందుగానే కాంట్రాక్టర్లు రాజకీయంగా అధికారులపై వత్తిడి తెచ్చి బిల్లులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఔట్‌సోర్సింగ్ జీతాల చెల్లింపుకు సంబందించిన ఆన్‌లైన్ నిలిచిపోయిందని కమీషనర్ సి.రవిచంద్రారెడ్డి చెప్పారు. నిధులు ఉన్నాయని ఆన్‌లైన్ ఓపెన్ అవ గానే వీరిజీతాలు చెల్లించనున్నట్టు పేర్కొన్నారు.



రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు

కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులతో పాటు రెగ్యులర్ ఉద్యోగులు, అధికారులకు కూడా మార్చి నెలకు సంబంధించిన జీతం చెల్లించలేదు. ఆన్‌లైన్‌లో జీతాల బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ ప్రభుత్వం జీతాలకు సంబంధించిన సైట్‌ను నిలుపుదల చేయడంతో జీతాల చెల్లింపు జరగలేదని ఉద్యోగులు తెలిపారు.

పోలింగ్ సిబ్బంది జాబితా సిద్ధం చేయాలి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బంది జాబితాలను పగడ్బందిగా సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తెలిపారు. పోలింగ్ సిబ్బంది నియామకాలపై బుధవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది తొలి విడత రాండమైజేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన వారిని పీవోలుగా నియమించేలా చూడాలన్నారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. సిబ్బంది కొరత గురించి అధికారుల ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(గురువారం)
సహెరీ (ఉదయం) 4.43 (శుక్రవారం)

దిక్సూచి
DIKSUCHI

జిప్‌మ్యాట్



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/JIPMAT/


డిప్లొమాలు

సీఐటీడీ

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు పదిహేను నుంచి పంతొమ్మిదేళ్ల మధ్య ఉండాలి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

- నాలుగేళ్ల డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (డీఈసీఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్ (డీఏఆర్ఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ (డీపీఈ)
- **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత డాక్యుమెంట్స్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్ఐఏఎంటీ



రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)-అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.3000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డిప్లొమా(ఆటొమొబైల్/ మెకానికల్/ మెటలర్జికల్/ మాన్యుఫాక్చరింగ్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్)/బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె, రాంచీ
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in

డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ ప్రోగ్రామ్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎంఎస్‌డీఎస్ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఆన్‌లైన్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉంటుంది. రెగ్యులర్ అభ్యర్థులు, విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. జాతీయ పరీక్ష స్కోర్/సంస్థ నిర్వహించే డీమ్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/బీఆర్క్/బీడిజైన్/బీఎఫ్‌టెక్/నాలుగేళ్ల బీఎస్సీ /ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గత మూడేళ్లలో నిర్వహించిన క్యాట్/గేట్/జీమ్యాట్/జీఆర్ఈ/జామ్ పరీక్షల్లో ఒకదానిలో అర్హత పొంది ఉండాలి. లేదంటే ఐఐటీ ఇండోర్ నిర్వహించే డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీమ్యాట్) 2024 రాయాల్సి ఉంటుంది.

డీమ్యాట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 10 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **డీమ్యాట్ 2024 తేదీ:** జూన్ 23
- **వెబ్‌సైట్:** msdsm.iiti.ac.in, msdsm.iimi.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8NYYasZలో చదవండి.

మీ ఫ్యామిలీకి ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ ఇది



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు ఈ సినిమాను నిర్మించారు. మంగళవారం రాత్రి దూలపల్లి మైసమ్మ గూడలోని కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. విజయ్ ఇప్పటివరకూ చేసిన నటన ఒక ఎత్తయితే, ఇందులో ఇచ్చిన పెర్ఫార్మెన్స్ మరో ఎత్తు. అలాగే మృణాళిని కూడా అద్భుతంగా నటించింది. బ్లడ్ అండ్ సోల్ పెట్టి ఈ సినిమా చేశాను. దిల్‌రాజుగారి బేనర్‌లో వర్క్ చేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది' అన్నారు.

'మీరంతా ఎగ్జామ్స్ రాసి పాసయిన తర్వాత నెక్ట్స్ క్లాస్‌లోకి వెళ్లడమే కాదు ఈ సినిమా చూసి ఫ్యామిలీ స్టార్స్ అవుతారు. ఈ సినిమాలో విజయ్ నటన అమ్మాయిలకు బాగా నచ్చుతుంది. అతని పాత్రను దర్శకుడు పరశురామ్ బాగా డిజైన్ చేశాడు. నవ్విస్తాడు, ఫైట్స్ చేస్తాడు. కోపం వస్తే కొట్టమని హీరోయిన్‌తో తన్నులు తింటాడు. మీరందరూ కూడా బాగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు దిల్ రాజు.

హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఇందు పాత్ర పోషించడం మొదటి 15 రోజులు చాలా కష్టంగా అనిపించింది. ఆ తర్వాత ఆ పాత్రను నా కంటే గొప్పగా ఎవరూ చేయలేరన్న సంతోషం కలిగింది. 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని మా ఫ్యామిలీ స్టార్ అయిన నాన్నకు అంకితం ఇస్తున్నా' అన్నారు. 'ఆరేళ్ల క్రితం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ 'గీత గోవిందం'. అదే దర్శకుడితో 'ఫ్యామిలీ స్టార్' చేశా. నా సినిమా రూ.వంద కోట్లు వసూలు చేయాలనే కల ఆ సినిమాతో తీరింది. మళ్లీ అటువంటి సినిమా నాకు రాలేదు. 'పెళ్లిచూపులు' నుంచి 'ఫ్యామిలీస్టార్' దాకా నేను చేసిన ప్రతి సినిమా ఏదో ఒక కొత్త విషయం నేర్పించింది. ఇబ్బందులు, అవరోధాలు, అవమానాలు ఎదురైనా వాటిని దాటుకుని అనుకున్నది సాధించాలి. అదే నమ్మకంతో నేను పనిచేస్తుంటా. మీ ఫ్యామిలీకి మా టీమ్ ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'. చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు విజయ్ దేవరకొండ.

ఆ కోరిక గీతాంజలితో తీరింది



అందాల నటి అంజలి నటించిన 'గీతాంజలి' చిత్రం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్ సంస్థతో కలసి కోన వెంకట్ నిర్మించారు.ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కోన వెంకట్ మాట్లాడుతూ 'ఒక తెలుగు అమ్మాయి 50 సినిమాలు చేయడం చాలా గొప్ప విషయం. అందుకే అంజలిని అభినందించాలి. ఆమెకు ఇది 50వ సినిమా. ఈ చిత్రానికి నేను కథ ఇచ్చినా దాన్ని పది మెట్లు ఎక్కించి ముందుకు తీసుకువెళ్లారు భాను, నందు. స్క్రిప్ట్‌లో ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. దర్శకుడు శివకు ఇది బెస్ట్ మూవీ అవుతుంది' అన్నారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ 'నా 50వ సినిమా చాలా స్పెషల్‌గా ఉండాలనుకున్నాను. ఆ కోరిక 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో తీరింది. అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసిన చిత్రమిది. 'గీతాంజలి' కంటే వంద రెట్లు బాగుంటుంది' అని చెప్పారు సినిమా ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందనీ, అంతకు మించి సినిమా ఉంటుందని దర్శకుడు శివ చెప్పారు. ఈ చిత్రంలో తను చెనక్కాయల శీను పాత్ర పోషించాననీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. 'గీతాంజలి' కంటే ఈ చిత్రం మరింత భయపెడుతుంది, నవ్విస్తుంది అని సత్యం రాజేశ్ తెలిపారు.

కల్ట్ లవ్‌స్టోరీ



దర్శకుడు నక్కిన త్రినాథరావు తన సొంత చిత్రనిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్స్‌లో నిర్మించే రెండో సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. పలు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'దృశ్యం' చిత్రంలో వెంకటేశ్ కుమార్తెగా నటించిన ఎస్తేర్ అనిల్ హీరోయిన్‌గా చేస్తున్నారు. వీరిద్దరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచాన్ చేయగా, హీరో సందీప్‌కిషన్ క్లాప్ ఇచ్చారు. సుమంత్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'ఇది కల్ట్ లవ్ స్టోరీ. టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ. ఇందులో విక్రమ్ పాత్ర అదిరిపోతుంది. ఎస్తేర్ లో మంచి ప్రతిభ ఉంది. తారక్ పొన్నప్ప కీలక పాత్ర పోషిస్తున్నారు' అని చెప్పారు. ఎవరూ ఊహించని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది అని దర్శకుడు వంశీకృష్ణ మల్ల చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MxpRMdS లో చదవండి.

తెనాలిలో పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా

● నిరుత్సాహానికి గురైన పార్టీ నేతలు, అభిమానులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందని, పర్యటన మళ్లీ ఎప్పుడు జరిగేది త్వరలో ప్రకటిస్తామని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ సెంటర్‌లో పవన్‌కల్యాణ్ సభ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జ్వరం కారణంగా రాలేకపోయారని అభిమానులు నిరుత్సాహానికి గురి కావద్దని కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పవన్‌కళ్యాణ్ పర్యటన ఖరారు చేశారు. సుల్తానాబాద్ వద్ద హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు సభలో పాల్గొనేందుకు వారాహి వాహనం కూడా మంగళవారం రాత్రి తెనాలి చేరుకుంది. పర్యటన వాయిదా పడటంతో జనసేన నేతలు, కార్యకర్తలు నిరాశకు గురి చేసింది.

వలంటీర్ల రాజీనామా వెనుక వైసీపీ కుట్ర

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఏప్రియల్ 3: రాష్ట్రంలో అర్హులైన పెన్షన్‌దారుల సొమ్ము వేల కోట్ల రూపాయలను పక్కదారి పట్టించి పెన్షన్‌ల పంపిణీలో జగన్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారులు మాత్రం 3వతేదీ నుంచి పింఛన్‌లు ఇస్తామంటూ దానికి తగిన ఆదేశాలను జారీ చేశారని, కానీ అవి తమకు అందకపోవడంతో పింఛన్‌దారులు నిరాశతో వెనుతిరిగి వెళ్లారని అన్నారు. పింఛన్‌దారుల్లో వ్యతిరేకత తీసుకురావటానికి జగన్మోహన్‌రెడ్డి కుటిల రాజకీయాలు ఆడుతున్నారన్నారు. సచివాలయ సిబ్బంది 11మంది ఉంటే పెన్షన్‌లను ఇంటింటికి తీసుకుని వెళ్ళి ఇవ్వలేని పరిస్థితి నెలకొందంటూ ప్రశ్నించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ళ వద్దనే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వలంటీర్ల చేత జగన్మోహన్‌రెడ్డి మూకుమ్మడి రాజీనామాలు చేయిస్తూ వారి చేత ఓటర్లపై బెదిరింపులకు దిగుతూ ప్రజలను అయోమయంలో నెట్టేందుకు చూస్తున్నారన్నారు. తమకు వలంటీర్లు అంటే గౌరవం ఉందని, అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరించరాదని సూచించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను రద్దు చేసే పనిలేదని కొనసాగిస్తామని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా తప్పుడు కార్యక్రమాలు చెయ్యనిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పింఛన్ల పంపిణీ కుట్రలు మానండి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: వైసీపీ రాజకీయ కుట్రలు మాని పింఛన్లు ఇళ్ళవద్ద పంపిణీ చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదే విషయం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి దృష్టికి తీసుకెళ్ళామని, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా వారి ఇళ్ళ వద్దకే పింఛన్లు ఇవ్వాలని కోరామన్నారు. కావాల్సినంతమంది సచివాలయ సిబ్బంది ఉండి, ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేసే అవకాశం ఉన్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వృద్ధులు, దివ్యాంగుల్ని ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీకి లబ్ధిదారులకు ఇబ్బంది లేకండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్రామల వారీగా పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని జీవీ ఆంజనేయలు తెలిపారు.

విద్యాభివృద్ధికి ఎంపీ లావు కృషి భేష్

● ప్రైవేటు పాఠశాలల యజమానులతో రత్తయ్య భేటీ

పిడుగురాళ్ళ, ఏప్రిల్3: పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి విద్యాసంస్థలతో పాటు పార్లమెంట్ అభ్యర్థిగా తన కుమారుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంతో కృషిచేశారని విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య అన్నారు. బుధవారం ఆయన పిడుగురాళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి యాజమాన్యాలతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. రత్తయ్యతో పాటు రుద్రమదేవి కూడా విద్యాసంస్థల యాజమాన్యాలతో భేటీ అయి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరింపజేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలుకు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుల గెలుపునకు సహకరించాలని విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను కోరారు.

ప్రజా ప్రయోజనాలే కూటమి లక్ష్యం

● గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
● కూటమి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరుసిటీ, ఏప్రిల్ 3: 'బీజేపీ ఒక బలమైన భావజాలం నుంచి ఉద్భవించిన పార్టీ. దేశ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎన్డీఏ కూటమి ఏర్పడింది.' అని గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్ నందు బీజేపీ, టీడీపీ పశ్చిమ నియోజకవర్గం ముఖ్య నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమన్వయ సమావేశం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిని పిడుగురాళ్ల మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ స్వచ్ఛభారత్, మేకింగ్ ఇన్ ఇండియా వంటి నిర్ణయాలు, అమలు నరేంద్రమోదీ వచ్చిన తర్వాతే సాధ్యమయ్యాయని ప్రశంసించారు. చంద్రబాబునాయుడుకు ఏపీ అంటే రెండు కళ్ళు అని 'ఏ'అంటే అమరావతి 'పీ'అంటే పోలవరం అని, కానీ జగన్‌కు మాత్రం ఏ అంటే ఆపడం 'పీ' అంటే పడగొట్టడం మాత్రమేనని పెమ్మసాని ఎద్దేవాచేశారు. గుంటూరు పశ్చిమ అభ్యర్థిని పిడుగురాళ్ల మాధవి మాట్లాడుతూ నేడు భారతదేశం ఉన్నతస్థితిలో ఉండడానికి నరేంద్ర మోదీనే కారణం అని అన్నారు. కూటమి నేతల గెలుపునకు నేతలు, కార్యకర్తలంగా సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి శనక్కాయల అరుణ ప్రసంగించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, సీనియర్ నాయకులు యడ్లపాటి రఘునాథబాబు, గుంటూరు పార్లమెంట్ సంయోజక్ భీమినేని, చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాస్, టీవీ రావు గుంటూరు టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, తాళ్ల వెంకటేష్ యాదవ్, డేగల ప్రభాకర్, డాక్టర్ నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు జగన్ వలలో చిక్కుకోవద్దు

● నూర్‌బాషాల ఆత్మీయ సమావేశంలో లావు, జీవీ, షరీఫ్



షరీఫ్, శ్రీకృష్ణదేవరాయులు, జీవీ, మక్కెనలను సత్కరిస్తున్న ముస్లింలు

వినుకొండ, ఏప్రిల్ 3 : ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న సీఎం జగన్‌రెడ్డి వలలో ముస్లింలు చిక్కుకోవద్దని శాసన సమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు విజ్ఞప్తి చేశారు. విభజించి పాలించాలని చూస్తున్న వైసీపీ కుయుక్తులపై అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. వినుకొండలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ముస్లిం నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి షరీఫ్ మాట్లాడుతూ ఎన్ఆర్‌సీ, సీఏఏ, ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్‌లను లోకసభ, రాజ్యసభలో బలపరిచిందని వైసీపీ కాదా అని ఆయన ప్రశ్నించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆయనను ఒప్పించి కలాంను రాష్ట్రపతిగా చేసిన చంద్రబాబుకు, జగన్‌కు మధ్య ఇక్కడ తేడా గమనించవచ్చన్నారు. బీజేపీతో ఉన్నప్పుడు హైదరాబాద్ హజ్‌హౌస్ నిర్మించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కడప, విజయవాడలో హజ్‌హౌస్‌లు నిర్మించడానికి రూ.70 కోట్లతో శంకుస్థాపన చేస్తే ఆ డబ్బును వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించి వాడుకుందని మండిపడ్డారు. టీడీపీ ఎప్పటికీ లౌకికే పార్టీనే అన్న షరీఫ్ ముస్లింల ధార్మిక ఇస్లామిక్ విషయాల్లో ఎవరైన జోక్యం చేసుకుంటే వ్యతిరేకించి తీరుతామన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంతానికి బొల్లా బ్రహ్మనాయుడు ఈ ఐదేళ్లలో రూ.300 కోట్ల నిధులు తీసుకువస్తే తాను ఐదేళ్లలో రూ.2600 కోట్లు తీసుకువచ్చానన్నారు. ముస్లీం షాదిఖానాలకు నిధులు అందిస్తామన్నారు. మర్కస్ మసీదు నిర్మిస్తుంటే చంద్రబాబుతో పాటు రూ.28 లక్షలు తీసుకువచ్చినట్లు తెలిపారు. తాను వ్యక్తిగతంగా మరో రూ.11లక్షలు అవసరమైన సిమెంట్ ఇచ్చామన్నారు. ఈద్గా మదర్సాల కోసం ఆర్థికసాయం చేసినట్లు వివరించారు. పేద ముస్లిం విద్యార్థుల చదువు కోసం ఉపకార వేతనాలు ఇచ్చామన్నారు. నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ నీతినిజాయితీకి నిలువుటద్దంగా నిలబడిన షరీఫ్ బాటలోనే ముస్లిం సమాజం నడవాలని విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో అమరావతి బిల్ విషయంలో మనస్సాక్షి ఖురాన్ విలువల మేరకు షరీఫ్ నిలబడ్డారని, అలాంటివ్యక్తి అందరికి ఆదర్శమన్నారు. ముస్లిం రిజర్వేషన్‌పై న్యాయపోరాటంలో టీడీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీఏఏకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏ ఒక్క ముస్లింకు ఎలాంటి ఇబ్బంది జరగదన్నారు. ఎన్ఆర్‌సీ దేశ ప్రజలందరికి ఒకేలా వర్తిస్తుందన్నారు. సీఏఏ బిల్లుకు వైసీపీలో ఉన్న అందరు ఓటువేసినా నేను ఓటు వేయకుండ బయటకు వచ్చానని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, నూరుబాషా సంఘం రాష్ట్ర అద్యక్షుడు సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముఖ ద్వారం

తగ్గిన విద్యుదుత్పత్తి

● ఏడాదిగా ఒక మిలియన్ యూనిట్ లోపే ..

రెంటచింతల,ఏప్రిల్ 3: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. సరైన వర్షాలు లేకపోవడంతో విద్యుదుత్పత్తిలో టార్గెట్‌ను కూడా చేరుకోలేకపోయారు. 50 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి రెండు టర్బయిన్లను ఏర్పాటు చేశారు. 2017 జనవరి 9న విద్యుత్ ఉత్పత్తిని ఆరంభించారు. అప్పటి నుంచి రికార్డుస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని చేసి అవార్డులు అందుకున్నారు. ఈఏడాది మార్చి 31నాటికి కేవలం 7284 ఎంయుల విద్యుత్ మాత్రమే తయారైంది. 2021-22లో 137.67 ఎంయులు, 2022-23లో 98.1246 ఎంయు(మెగాయూనిట్లు)ల విద్యుత్ తయారైంది. ప్రాజెక్టు ఆరంభం నుంచి ఇప్పటివరకు 473.47 ఎంయుల విద్యుత్ తయారైంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7టీఎంసీల నీరుంది.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



వృద్ధుడి మృతదేహం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 3: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు నరసరావుపేట రెండవ పట్టణ సీఐ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1న ఓ గుర్తు తెలియని వ్యక్తి పల్నాడు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద స్పృహ తప్పి పడి పోయి ఉన్నాడని, 108 అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఈనెల 2వ తేదీన చనిపోయాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో

వైసీపీ నేతలపై ఏఆర్వో ఫిర్యాదు

● ఎమ్మెల్యే రోశయ్య, నూరిఫాతిమాతో పాటు మరికొందరిపై కేసు

పెదకాకాని, ఏప్రిల్ 3: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని మద్దిరాల కాలనీ, బసవతారకరామనగర్, మంగళదాస్‌నగర్‌లలో అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన గుంటూరు పార్లమెంటు వైసీపీ సమన్వయకర్త, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యపై, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా, ఎమ్మెల్యే ముస్తఫా పీఏ షేక్ మస్తాన్‌వలి, 57వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు నూర్‌లపై పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. గతనెలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. దీనిపై గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్-1, తూర్పు నియోజకవర్గ ఏఆర్‌వో వెంకటలక్ష్మి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెదకాకాని పోలీసులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్టుగా ఆ నలుగురితోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

ఇద్దరు వలంటీర్లు సస్పెన్షన్

● ఎన్నికల ప్రచారంల్లో పాల్గొన్నందుకు అధికారుల చర్యలు

కారంపూడి, ఏప్రిల్ 3: మండలంలోని కాచవరం గ్రామానికి చెందిన వలంటీర్లు ముప్పల రాజశేఖర్‌రెడ్డి, షేక్ యూసఫ్‌బాషాలను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజశేఖర్‌రెడ్డి, యూసఫ్‌బాషాలు పాల్గొన్నట్లు తమ విచారణలో తేలడంతో, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారిని విధులు నుంచి తొలగించామని అన్నారు.

వలంటీర్ల రాజీనామాలు

వేమూరు, ఏప్రిల్ 3: మండల కేంద్రమైన వేమూరులోని రెండు సచివాలయాల పరిధిలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. సచివాలయం1 పరిధిలో 22 మంది ఉండగా వారిలో 9 మంది, సచివాలయం 2 పరిధిలో 21 మంది గాను వారిలో నలుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను అందజేయగా, వాటిని ఈఎస్‌డబ్ల్యూఎస్‌కు పంపడంతో పాటు సంబంధిత నివేదికలను కలెక్టర్‌కు పంపామన్నారు.

కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల సచివాలయం - 2లో వలంటీర్లుగా పనిచేస్తున్న మొగిలి వెంకట్రావు, ఇరిగిదెండ్ల మరియమ్మ, కాండ్రకొండ వీరేశ్వరరావు, అంబేపల్లి శివనాగరాజు, చీమలదిన్నె చిన వెంకయ్యలు బుధవారం తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి అందించారు.

వట్టిచెరుకూరు: మండలంపరిధిలోని గారపాడు, చింతపల్లిపాడు, కుర్నూతల గ్రామ పంచాయతీల పరిధిలో 25 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా, ఆయా పత్రాలను సచివాలయ సెక్రటరీలకు అందజేశారు. ఆమూడు పంచాయతీలు వైసీపీ పాలకవర్గం నిర్వహణలో ఉండటం గమనార్హం. ఈ విషయంపై ఎంపీడీవో శేషగిరిరావు స్పందిస్తూ వలంటీర్లు రాజీనామా చేసిన మాట వాస్తవమేనని, ఆయా పత్రాలు తన వద్దకు రాగానే ఆమోదిస్తూ వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీచేస్తానని స్పష్టం చేశారు.

మాచవరం : మండలంలోని తురకపాలెం గ్రామంలో బుధవారం 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఆ సచివాలయ పరిధిలో మొత్తం 15 మంది వలంటీర్లు ఉండగా, వారిలో 10 మంది వలంటీర్లు రాజీనామాచేసి ఆయా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీ నామా ఆయా వలంటీర్లు వారి రాజీనామా పత్రాల్లో పేర్కొన్నట్లు ఎంపీడీవో సురేష్ వివరించారు.

అంబటి ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్



పాకాలపాడు గ్రామంలో అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరు ఈపూరి కృష్ణారెడ్డి

సత్తెనపల్లి, ఏప్రిల్ 3 : సత్తెనపల్లి వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు పాల్గొంటున్నారు. మంగళవారం కట్టావారిపాలెంలో నిర్వహించిన రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గుంటగాని తిరుపతిరావు పాల్గొన్నారు. అలాగే బుధవారం సత్తెనపల్లిమండలం పాకాలపాడులో జరిగిన అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామా నికి చెందిన వలంటీర్లు ఈపూరి కృష్ణారెడ్డి, బూతు కూరి స్వాతి పాల్గొన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రచారంలో పాల్గొనటంపై పలువురు చర్చించుకుంటున్నారు.

ఐదేళ్లలో రాష్ట్రం వెనుకబాటు

● 1569వ రోజుకు రైతుల ఆందోళనలు



తుళ్ళూరులో నినాదాలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 3: గత ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల అయినా రాజధాని అమరావతిని నిర్మించలేక పోయింది.. మన ప్రభుత్వం వచ్చిన తరువాత అమరావతిని బ్రహ్మాండంగా కడదామని సీఎం జగన్‌రెడ్డి చెప్పటాన్ని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు గుర్తుచేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1569వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడతూ, జగన్‌రెడ్డి తన పరిపాలనా లోపాన్ని కప్పిపుచ్చుకోవటానికి మూడు రాజధానులని ప్రజల దృష్టిని మరల్చారన్నారు. పాలన చేత కాని ముఖ్య మంత్రి అప్పుడే రాజీనామా చేయాల్సిందన్నారు. ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనకబాటుకు గురి చేశారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం అమరావతి అభివృద్దిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలల్లో ఇళ్ల వద్ద నుంచి, శిబిరాల నుండి రైతులు మహిళలు ఆందోళనలు కొనసాగాయి.



బీసీ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రభుత్వం రాగానే బీసీలకు రక్షణ చట్టం

● జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్3: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకు వస్తామని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఉప ప్రణాళిక ద్వారా వారి నిధులు వారి సంక్షేమానికే ఖర్చు చేస్తామని, బీసీల రక్షణకు నిబద్ధతతో పని చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చారన్నారు. పట్టణంలోని 10వ క్లస్టర్ పరిధిలోని సుబ్బయ్యతోటలో జయహో బీసీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ పాలనలో బీసీ ఉప ప్రణాళిక ద్వారా రూ.50 వేల కోట్లు బీసీ కార్పొరేషన్‌లు, ఫెడరేషన్‌ల ద్వారా రుణాలు అందించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను వంచించిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికీ కులాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపు కోవాలని చూస్తున్నారన్నారు. పైగా 74 మంది బీసీ నాయకులను క్రూరంగా నరికి చంపిన జగన్ ముఠా మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో జనం లేరన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ కూటమి కార్యకర్తలంతా ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లాలని ప్రత్తిపాటి సూచించారు. అనంతరం పలువురు వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరగా వారికి ప్రత్తిపాటి పుల్లారావు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోకవర్గంలో టీడీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని ప్రత్తిపాటి సూచించారు.



ఉత్తమ పరిశోధన పత్రం సమర్పించిన వారికి మెమోంటో అందజేస్తున్న వీసీ జయలక్ష్మీదేవి

సాంకేతిక ఆవిష్కరణలకు సదస్సులు తోడ్పాటు

● వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి
● బాపట్ల వ్యవసాయ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 3: విద్యార్థుల సాంకేతిక అభివృద్ధికి సదస్సులు తోడ్పడుతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో రెండురోజుల జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. జాతీయస్థాయి శాస్త్ర, సాంకేతిక సదస్సు ముగింపు కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి వ్యవసాయ విద్యార్థులకు వ్యవసాయరంగంలోని శాస్త్ర, సాంకేతికత పట్ల అవగాహన పెంపొందించేందుకు అనేక అవకాశాలున్నాయన్నారు. వాటిని అనుసరించటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని ఆమె తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతులు ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకోవాలనే అంశంపై ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సును బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన యూనివర్సిటీ పీజీడీన్ డాక్టర్ ఏవీ.రమణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్‌మేనేజర్ సయ్యద్ జవహర్, డైరెక్టర్ ఆప్ విస్తరణా విభాగం డాక్టర్ కె.ఎస్.ఎస్.నాయక్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణసాగర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన పరిశోధన పత్రాలను, పోస్టర్‌లను సమర్పించారు. ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్‌లు, మెమోంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ సాయిరాంకుమార్, విద్యార్థి విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైల్వే సీనియర్ డీవోఎం దినేష్‌కుమార్

సరుకు రవాణాలో రికార్డు ఆదాయం

● అభినందన సభలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల సమష్టి కృషితోనే సరుకు రవాణాలో రికార్డు స్థాయిలో రూ.395.8 కోట్ల ఆదాయాన్ని గత వార్షిక సంవత్సరంలో సాధించడం జరిగిందని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ అమరావతి ఎనెక్స్‌లో జరిగిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ డీవోఎం ఎం.దినేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ అధికారులు, కార్మికుల సమన్వయంతో ఎలాంటి లోపాలకు తావులేకుండా పక్కా ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. వివిధ వ్యాపారసంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి తక్కువ సమయంలో సరుకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, రైల్వే అధికారులు, ఉద్యోగులు, ఆపరేటింగ్, కంట్రోలర్స్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

1,09,377 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,11,752 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,09,377 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,603 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	19000
నెంబరు. 5	9000	17000
273	10000	14500
341	9000	17000
4884	9000	14000
సూపర్ 10	12000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	9000	18000
తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు



తాళ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బ్రహ్మారెడ్డితో స్థానిక మహిళలు

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

● ఉమ్మడి కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 3: పెన్షన్ల పంపిణీ విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న శవ రాజకీయాలను మానుకోవాలని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 50 లక్షల మంది పెన్షనర్లకు లక్షన్నర మందికి పైగా ఉన్న సచివాలయ ఉద్యోగస్తులతో ఇంటింటికి తిరిగి పెన్షన్ అందించకపోవడం శోచనీయమన్నారు. అధికారులు వైసీపీ నేతలతో కలసి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, పెన్షన్ల పంపిణీలో కావాలనే జాప్యం చేస్తూ, ఆ సందర్భంగా లబ్ధిదారుల నుంచి పెల్లుబికే ఆగ్రహాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టేందుకు కుట్రపన్నారన్నారు. నియోజకవర్గంలోని పల్లెల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఆధునిక దేవాలయం నాగార్జున సాగర్ డ్యాం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రాజెక్టులను సాధించుకొని తాగు, సాగునీరు ప్రతి గ్రామానికి అందేలా కృషి చేస్తానన్నారు. తాళ్లపల్లికి చేరుకున్న బ్రహ్మారెడ్డికి ప్రజలు బ్రహ్మారథం పట్టారు. కార్యక్రమంలో నేరేటి వీరాస్వామి యాదవ్, మద్దిగపు పెద వెంకట్రామిరెడ్డి, గుండాల శ్రీను, పసుపులేటి బ్రహ్మయ్య, పంగులూరి పుల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మీ కష్టసుఖాల్లో బ్రహ్మారెడ్డి అండగా ఉంటారు

రెంటచింతల, ఏప్రిల్ 3: మాచర్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపించాలని, ఎమ్మెల్యేగా ఆయన ఎల్లప్పుడూ మీ కష్టసుఖాల్లో అండగా ఉంటాడని బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రెంటచింతలలోని కొత్తకాపు గడ్డ, ఆంతోని వారి కాలనీ, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి అహర్నిశలు కృషిచేయాలని, అప్పుడే మన జీవితాల్లో వెలుగు నిండుతుందన్నారు. అలాగే తుమ్మకోట గ్రామంలోని గాంధీ నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, నాగేంద్రబాబు, తుమ్మా జోజిరెడ్డి, పురం శ్రీను, సాగర్, టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

దుర్గి, ఏప్రిల్ 3: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నేతల ప్రచారం జోరందుకుంది. బుధవారం మండల పరిధిలోని అడిగొప్పుల, ఓబులేశునిపల్లె, ముటుకూరు, ధర్మవరం, దుర్గి గ్రామాల్లో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్ 6 పథకాలను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో జక్కా కొండలు, వెలిదండి శ్రీనివాసరావు, కటకం భవన్నారాయణ, బీమా అంజయ్య, సూరె కృష్ణ, మేకల రామారావు, పుల్లయ్య, చలవాది మల్లికార్జునరావు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సుంకర వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

టీడీపీతోనే బీసీలకు న్యాయం జరిగిందని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మండల కేంద్రమైన దుర్గి షాదీఖానాలో బుధవారం టీడీపీ ఆధ్వర్యాన జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో బీసీలను ఉపయోగించుకోవడమే తప్ప న్యాయం చేయలేదన్నారు. జగన్ పాలనలో బీసీల హత్యలు ఎక్కువగా జరిగాయని, నిందితులకు శిక్ష పడిన దాఖలాలు లేవని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీకి అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కులను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సింగు నాగేశ్వరరావు, దుర్వాకుల ప్రసాద్, ఓర్సు కోటేశ్వరరావు, మేకల రామారావు, శ్రీహరి, షేక్ అల్లాబాషా, రాముడు, గుంటి సీతారామయ్య, పెదగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అంబటి నమ్మకంగా మోసం చేశాడు

సత్తెనపల్లి ఏప్రిల్ 3: ఎమ్మెల్యే అంబటి రాంబాబు తనను మోసం చేశాడని వైసీపి జిల్లా మాజీ ప్రదాన కార్యదర్శి మదమంచి రాంబాబు అన్నారు. బుధవారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం 4 ఎకరాలు పొలం అమ్ముకున్నాని, తన అధికారం కోసం అంబటి రాంబాబు తనను పార్టీకి దూరం చేశాడన్నారు. సంక్రాంతి సంబరాలకు 11లక్షల రూపాయల చందా రాంబాబుకు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు లక్షల పెట్టుబడి పెట్టి నష్టపోయానన్నారు. కాంగ్రెసు, టీడీపీ హయాంలోనే కట్టావారి పాలెం అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామ అభివృద్ధికి రాంబాబు చేసిందేమీ లేదన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

గురజాలటౌన్, ఏప్రిల్ 3: పట్టణ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌పై రెవెన్యూ అధికారి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ ఉద్యోగికి సంబంధించిన ద్వి చక్రవాహనం అదృశ్యమైంది. సీసీ పుటేజీ పరిశీలించగా గురజాల పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్ వాహనాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ బాలకృష్ణను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని, దీనిపై విచారణ జరుగుతోందని, విచారణ అనంతరం చర్యలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు.

యరపతినేని ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు

మాచవరం, ఏప్రిల్ 3:మండలంలోని తురకపాలెం గ్రామంలో గురువారం గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు మండల తెలుగుయువత అధ్యక్షుడు షేక్ హసన్‌వలి, మాజీ సర్పంచ్ షేక్ మాబువలిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కూటమి అభ్యర్థుల విజయానికి తోడ్పడాలి

రాజుపాలెం,ఏప్రిల్3:ఎన్డీఏ కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్యలు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మొక్కపాడు గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులైన కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీకృష్ణదేవరాయులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, వారి గెలుపుతో పల్నాడులో సాకారమయ్యే అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కణదం పద్మ, శ్రీనివాసరావు, నెల్లూరి అహల్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు తొలగింపు

దాచేపల్లి, ఏప్రిల్ 3: దాచేపల్లి మండలంలోని గామాలపాడు గ్రామానికి చెందిన దాదాసాహెబ్ అనే వలంటీర్‌ను విధుల నుండి తొలగించినట్లు ఎంపీడీవో వెంకటరమణ బుధవారం తెలిపారు. రాజకీయ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లుగా వారు భావించారు. కేశానుపల్లి గ్రామానికి చెందిన ఎం షరీఫ్, పి. నరసింహారావు అనే వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో ఎంపీడీవోకు రాజీనామాలను అందజేశారు.

పింఛన్ల ఆలస్యం వైసీపీ కుట్రే..



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

● అవ్వతాతలను ఇబ్బంది పెడితే సహించేది లేదు
● ఎన్నికల ముంగిట వృద్ధులతో పింఛన్ల రాజకీయం తగదు
● ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేయాలి
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 3: పింఛన్‌దారులకు నగదు పంపిణీ ఆలస్యం కావడంలో వైసీపీ ప్రభుత్వ కుట్రపూరిత కోణం దాగి ఉందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. వ్యూహం ప్రకారమే ఖజానా ఖాతాకు నగదు జమ చేయకుండా 3వ తేదీ నుండి పింఛన్ల పంపిణీ అని జగన్ సొంత పత్రికలో ప్రచారంచేసి, ప్రతిపక్షాల తీరుతోనే పంపిణీ ఆలస్యమవుతుందని ప్రచారం చేటయం దుర్మార్గమన్నారు. బుధవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో యరపతినేని విలేకరులతో మాట్లాడుతూ.. పింఛన్ దారుల ఇంటింటికి వెళ్లి నగదు ఇవ్వాలని టీడీపీ, జనసేన, బీజేపీ మొదటినుండి కోరుతున్నప్పటికీ సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్ తీసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. అవ్వాతాతలను ఎక్కడైనా ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించబోమని యరపతినేని హెచ్చరించారు. సచివాలయాల్లో కాకుండా ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందజేసే అవకాశం వున్నా సచివాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయడాన్ని చూస్తే పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. ఒక్కొక్క సచివాలయంలో 10 నుండి 15 మంది సిబ్బంది వుండగా గ్రామాలలో వున్న అతికొద్ది మంది ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం సమస్యేమి కాదన్నారు.

అధికారుల తీరులోనూ మార్పు రావాలి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్న సభలో భద్రత కొట్టొచ్చినట్లు కనిపించిందని, ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు, పార్టీకి చెందిన పలువురు నేతలను కూడా సభలకు రాకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా ట్రాఫిక్ ఆంక్షలు పేరుతో కిలోమీటర్ల కొద్దీ వాహనాలను నిలిపి పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేసిన ఘటనతో పాటు బీజేపీ, జనసేన నేతలను కూడా ప్రధానమంత్రిని కలిసే అవకాశం లేకుండా పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఐజీ పాల్‌రాజ్‌లు వ్యవహరించారన్నారు. ఇకనైనా పోలీసు అధికారులతో పాటు మరికొన్ని శాఖల అధికారులు తీరు మార్చుకొని ఎన్నికల నిబంధనల మేరకు పనులు చేయాలని యరపతినేని సూచించారు. ఈ ఎన్నికల్లో కేంద్ర సహకారాన్ని తీసుకుంటామని, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుపాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నట్లు యరపతినేని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు రంజాన్ మాసం సందర్భంగా యరపతినేని శ్రీనివాసరావును సత్కరించి పవిత్ర మక్కా జమ్ జమ్ జలాన్ని అందజేశారు. అనంతరం బీజేపీ నేలు యేలూరి శశి, వడ్లమూరి వెంకయ్య, జనసేన నేతలు కటకం అంకారావు, దూదేకుల ఖాశింసైదా, పలువురు మాట్లాడారు.

సమావేశంలో షేక్ బాబావలి, తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, కోట హరి, సయ్యద్ అమీర్‌అలి, మల్లెల ఆదినారాయణ, వడ్డవల్లి సాంబశివరావు, వివి నాగేశ్వరరావు, కట్టమూరి ఉమామహేశ్వరరావు, ఆత్మకూరి కాశి, పణితి రవి, పిల్లి చెన్నారావు, ఎల్‌వీఆర్, తదితరులు పాల్గొన్నారు.

6న సత్తెనపల్లిలో చంద్రబాబు 'ప్రజాగళం' యాత్ర

● టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలి
● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా , వేదికపై యెలినేడి, నాగోతు,చౌట

సత్తెనపల్లి ఏప్రిల్ 3: ఎన్నికల ప్రచార రోడ్డు షోలో భాగంగా ఈ నెల 6న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు యాత్ర సత్తెనపల్లిలోకి ప్రవేశించనుందని, నియోజకవర్గంలోని కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటన గురించి పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో బుధవారం ఆయన కూటమి నేతలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ ప్రజాగళం యాత్ర పెదకూరపాడు నియోజకవర్గాన్ని వీడి పెదమక్కెన వద్ద సత్తెనపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న సందర్భంలో నారా చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నేతలు యెలినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, కనుమూరి బాజీ చౌదరి, నాగోతు శౌరయ్య తదితరులు మాట్లాడగా, బీమినేని వందనా దేవి, ఆళ్ళ సాంబయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెదకరి ముల్లా, బత్తుల వెంకటస్వామి, అంకాళ్ళ ప్రభు దాసు, బతుల నాగేశ్వర రావు, పల్లపాటి పెద్దిరాజు, నాదెళ్ళ సత్యన్నారాయణ, ఆళ్ల అమరేశ్వర రావు, శిరిగిరి శ్రీనివాసరావు, తోట నర్సయ్య, తిరుమలశెట్టి మల్లేశ్వరి, మన్నవ శారద, యెలినేడి లక్ష్మీతులసి, తరక మేరిగ్రేస్, జీ. సుశీల, జానీ ఖాజావలి, సంధ్య, అంబిక, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు ..

రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ద్వారానే రాష్ట్రంలో మార్పు సాధ్యమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి ఏర్పడిందన్నారు. జగన్ అరాచక పాలనను అంతమొందించేందుకు కూటమి పని చేస్తుందని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సైకో సీఎం జగన్‌ను సాగనంపేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పని చేస్తుందన్నారు.

యానాదుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

యానాదుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు తిరువీధుల శంకర్ ప్రసాదు అన్నారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న యానాది సంఘాలన్నీ టీడీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. వైస్ జగన్ పాదయాత్రలో యానాదులకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమయ్యారన్నారు. యానాదులను మోసం చేసిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు కాట్రోత్తు పురుషోత్తం నాయక్, జరావత్ రఘు నాయక్, దుర్గారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా ..

రాజుపాలెం : ముస్లింలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో డాక్టర్ సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. అందరు కలిసి సుఖ సంతోషంగా ఆనందంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలతో పాటు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, ఏప్రిల్ 3: నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఊరు వదిలిపోయిన వ్యక్తులు ఎవరి వల్లనైనా భయం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పోలీసు, రెవెన్యూ శాఖ సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. నియోజకవర్గంలో 635 మందిని బైండోవర్ చేశామన్నారు. 151 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని, ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 6వ తేదీ నాటికి పింఛన్ల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయం వద్ద స్వీప్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు.

కూటమి నేతలను గెలిపించాలి

నకరికల్లు, ఏప్రిల్ 3 : సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య కోరారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో బుధవారం శౌరయ్య స్థానిక టీడీపీ నేతలతో కలసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమని శౌరయ్య తెలిపారు. సూపర్ - 6 మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పాలడుగు శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, దూదేకుల హుస్సేన్‌బీ, మేకల అరుణ, జీ కన్నారావు, పలువురు టీడీపీ నేతలు, పాల్గొన్నారు.

చీమలమర్రిలో టీడీపీ బీసీ నేతల ప్రచారం

వైసీపీని ఓడించాలని, అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు పరిచే టీడీపీకి పట్టం కట్టాలని టీడీపీ బీసీ నేతలు చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పోలవరం పూర్తికావాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలన్నా కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి ఏడుకొండలు, కోటపాటి శ్రీనివాస్, రాజవరపు గురవయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

టీడీపీపై ఆరోపణలు కుట్రపూరితం

కారంపూడి, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన నగదు ఖజానాలో లేకపోవడంతో వైసీపీ ప్రభుత్వం తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై చేస్తున్న ఆరోపణలు కుట్రపూరితంగా ఉన్నాయని టీడీపీ నేత చిరుమామిళ్ల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక పెన్షన్లను నిరంతరాయంగా అమలు చేసింది టీడీపీనే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా రెండు రోజుల్లో పెన్షన్ పంచలేరా అంటూ ప్రశ్నించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

విజయపురిసౌత్, ఏప్రిల్ 3: మాచర్ల మండలం కొత్తపల్లిలో వేంచేసియున్న గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికల్యాణం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అల్లం కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని, సాయంత్రం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించనున్నట్లు చెప్పారు. రాత్రి 7 గంటల నుంచి మహా అన్నదానం జరుగుతుందన్నారు.

రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి

మాచర్లటౌన్, ఏప్రిల్ 3: ఎన్నికల విధుల నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు జగన్‌రెడ్డి ఆజ్ఞలమేరకు కాకుండా రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీకి వంతపాడిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఈసీ కొరడా ఝులిపించడం మంచి విషయమన్నారు. జగన్‌రెడ్డిని నమ్ముకొని పదవులు పొందినవారు జగన్‌తోపాటు జైలుపాలు కాక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

రైతుకి ఆర్థిక సాయం

పెదకూరపాడు, ఏప్రిల్ 3 : పంటలు సరిగా పండక, ఆర్థికంగా నష్టపోయిన పెదకూరపాడుకు చెందిన చిన్నబాబు అనే రైతుకి మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన తెలుగు యువత నేత మేదరమెట్ల సౌమిత్ ఆర్థిక సాయాన్ని అందించారు. సౌమిత్ సేవలు మరువ లేనివని పలువురు కొనియాడారు.

పింఛన్ల పంపిణీ ఆలస్యం..

కారంపూడి, ఏప్రిల్ 3: జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభించిన పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది. కారంపూడి సచివాలయం - 1 పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి పెన్షన్ అందిస్తామని చెప్పిన అధికారులు సాయంత్రం 4 గంటలకు నగదు విత్ డ్రా చేసుకొని వచ్చి అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మాచర్లటౌన్ : పురపాలకసంఘ పరిధిలోని 16 సచివాలయాల్లో 116 మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్ పంపిణీ జరుగుతుందని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాత్రి 10 గంటల వరకు పెన్షన్ పంపిణీ కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. బుధవారం కోర్టు బజారు, రైల్వే స్టేషన్ సచివాలయంలో పెన్షన్ పంపిణీ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి రోజు 25 శాతం పంపిణీ చేశామని తెలిపారు.

పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గ పరిధిలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన పింఛన్ల పంపిణీ సాయంత్రం 7గంటల వరకు జరిగింది. 19 శాతంకు పైగా పంపిణీ పూర్తియిందని అధికారులు తెలిపారు. ఎంపీడీవోలు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గురజాలటౌన్: బ్యాంకుల్లో పింఛన్ నగదు జమ ఆలస్యం కావడంతో మధ్యాహ్నం నుంచి పింఛన్‌ల పంపిణీ ప్రారంభమైంది. బుధవారం సాయంత్రానికి 50 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పింఛన్ పంపిణీకి ఎంపీడీవో రామకృష్ణనాయక్ పరిశీలించారు.

సత్తెనపల్లి : వార్డు, గ్రామ సచివాలయాల్లో ఫెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభ మైంది. సచివాలయాల వద్ద 6వ తేదీ వరకు, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్లను పంపిణీ చేస్తారని ఉన్నతాధికారులు ప్రకటించారు.

నకరికల్లు : నకరికల్లు మండలంలో 9720 మంది ఫెన్షన్ దారులు ఉన్నారు. ఈనెల 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఫెన్షన్‌ల పంపిణీని సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. 3,587 మందికి సాయంత్రం 7 గంటల సమయానికి పంపిణీ చేయ గలిగారు. 37 శాతం మాత్రమే ఫెన్షన్‌ల పంపిణీ పూర్తి చేయ గలిగారు.

మాచవరం : మండలంలో మొత్తం 15 పంచాయతీలలో 7,563 పింఛన్లకు గాను రూ.2,24,79,000 నగదు మంజూరైనట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. ఆయా గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. సచివాలయాల వద్ద వేసవి కాలం దృష్ట్యా తాగు నీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

ఒక్కసారి ఆదరించండి.. సేవకుడిగా పని చేస్తా

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 3 : తనను ఒక్కసారి ఆదరిస్తేనే ఐదు సంవత్సరాల పాటు పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని వెంకటాయపాలెం, రామాంజనేయపురం, మన్నె సుల్తాన్ పాలెం, యమ్మాజీగూడెం, పాపాయపాలెం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పాపాయపాలెం గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అయితేనే అభివృద్ధి, సంక్షేమం సాకారమవుతుందన్నారు. పాపాయపాలెం గ్రామం గతంలో టీడీపీకి కంచుకోట అని, గ్రామానికి పూర్వ వైభవం తెచ్చేలా టీడీపీ నేతలు కృషి చేయాలని సూచించారు. పాపాయపాలెం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటానని ఉంటానని, ఫోన్ చేస్తే మీ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, పాపాయపాలెం మాజీ సర్పంచ్‌లు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైస్ సర్పంచ్ ప్రసాదరావు, పీఎస్‌కే రసూల్, గుడిసె కొండయ్య, హనుమంతరావు నాయక్, జనసేన అధ్యక్షురాలు రమాదేవి, ఇబ్రహీం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి సంపాదనను దోచుకుంటున్న పెదకూరపాడు ఎమ్మెల్యే

ప్రకృతి సంపదను పెదకూరపాడు ఎమ్మెల్యే దోచుకుంటున్నాడని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఏ తప్పు చేయకుండానే 53 రోజుల పాటు జైల్లో ఇరికించారని, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి చేసిన నారా చంద్రబాబు నాయుడిని ఎలాంటి తప్పు చేయకుండానే ఇబ్బంది పెడితే సామాన్య మానవులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల కాలం 45 రోజుల పాటు ప్రతి ఒక్క టీడీపీ నేత, కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో మండల టీడీపీ నేతలు గుడిసె కొండయ్య, పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, బల రామిరెడ్డి, వెంకట రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, రామకృష్ణ, గుడిసె కొండయ్య, గుంజా గంగారావు, ఓర్సు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రాయిడి హనుమంతరావు

అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన వైసీపీ నేత రాయిడి హనుమంతరావు అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం బెల్లంకొండ మండలం పాపాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. బాష్యం ప్రవీణ్ అతనికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మొక్కపాటి గిరిబాబు, పోట్ల శ్రీనివాసరావు, గంధం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామికి పూజా మహోత్సవం

పెదకూరపాడు, ఏప్రిల్ 3 : పెదకూరపాడు మండలంలోని గారపాడులో ప్రసన్నాంజనేయ స్వామికి మండల అభిషేక పూజామహోత్సవాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠ చేసిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ కార్యదర్శి కంకణాల శివాజీ దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రైతులు పాడి పంటలతో, సుఖ సంతోషాలతో ఆంజనేయ స్వామి ఆశీస్సులు వారికి తోడుగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటుందని, తద్వారా యువత అభ్యున్నతి లభిస్తుందని తెలుగు యువత అధ్యక్షులు చిన్నబోయిన రాఘవ యాదవ్ అన్నారు. నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గెలుపు కోరుతూ ఆయన ఆదేశాల మేరకు రాఘవ యాదవ్ మండలంలోని బృగుబండ, కందులవారిపాలెం, గోగులపాడు, కట్టావారిపాలెం, లక్కరాజుగార్లపాడు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పన, యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అందజేయనుందని తెలిపారు. ప్రజలంతా చంద్రబాబుకు మద్దతుగా నిలిచి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు ఉన్నం శ్రీనివాసరావు, శివనాగబాబు, సైదా, వెంకట్రామయ్య, మల్లారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుట్టు మిషన్‌ల శిక్షణ ప్రారంభం

అచ్చంపేట, ఏప్రిల్ 3 : మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు కుట్టు మిషన్‌ల శిక్షణ ప్రారంభించనున్నట్లు స్నేహ హస్తాల మండల ప్రతినిధి తుమ్మా శౌరిరెడ్డి బుధవారం తెలిపారు. పరి ఫౌండేషన్(యూఎస్ఏ) సహకారంతో జరిగే శిక్షణా కార్యక్రమం 50 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు.

వృద్ధులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

పెదకూరపాడు, ఏప్రిల్ 3 : పెదకూరపాడులోని సచివాలయం వద్ద పింఛన్‌ల కోసం వచ్చిన వృద్ధులకు టీడీపీ నియోజక వర్గ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సూచనలతో తెలుగు యువత ప్రతినిధులు మజ్జిగ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. మధ్యాహ్నం నుంచి పింఛన్‌లు పంపిణీ చేస్తారని, గ్రామ సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులను వాని ద్విచక్ర వాహనాలపై తీసుకు వెళ్లి ఇళ్ళ వద్దకు చేర్చారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

సత్తెనపల్లి, ఏప్రిల్ 3 : ఎండ తీవ్రత పెరిగి నందున ప్రజల సౌకర్యార్థం సత్తెనపల్లి పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుంది

సత్తెనపల్లి, ఏప్రిల్ 3 : ఫెన్షన్‌ల పంపిణీ పై వైసీపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు వాలంటీర్లను దూరంగా పెట్టి సచివాలయ సిబ్బంది చేత ఫెన్షన్‌లను పంపిణీ చేయాలని చెబితే సక్రమంగా ఫెన్షన్‌లను పంపిణీ చేయకుండా ఫెన్షన్ దారులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సచివాలయాల్లో పని చేసే సిబ్బంది ద్వారా ఇంటింటికి ఫెన్షన్‌లు పంపిణీ చేయించాలని ఆయన అధికారులను కోరారు.

పార్టీల ప్రతినిధులతో సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 3 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న మురళీకృష్ణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సీ విజిల్, హోం ఓటింగ్ తదితర అంశాల గురించి సమావేశానికి హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు తదితర అంశాల గురించి చర్చించారు. టీడీపీ నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, పూజల వెంకట కోటయ్య, నూర్‌బాషా జానీబాబు తదితరులు ఎన్నికల అధికారితో చర్చించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

తుది జాబితాల్లోనూ తప్పుల తడకలే..!



ఓటరు కార్డులో ఫోటో మహిళది పేరు పురుషుడిది

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఓటర్ల జాబితాల్లో తప్పులు పూర్తిస్థాయిలో సరిద్దిలేదు. ఇంకా జాబితాల్లో తప్పుల తడకలుగానే ఉన్నాయి. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్నా తప్పుల గురించి పట్టించుకోవడంలేదు. ఫొటో ఒక రిది పేరు మరొకరది ఉండటం గమనార్హం. కొత్తగా ఓటరుగా నమోదు, చిరునామా మార్పు, ఓటు బదలీ చేసుకున్న వారికి కొత్త ఓటరు కార్డులు పోస్టు ద్వారా వస్తున్నాయి. కార్డులను చూసుకొని ఓటర్లు అవాక్కవుతున్నారు. పురుషుడి పేరు ఉంటే.. మహిళ ఫొటో ఉంటోంది. ఇలాంటి తప్పులు ఓటర్ల జాబితాలో దొర్లాయి. ఈ చిత్రంలోని కార్డులో పోటో మహిళది ఉండగా పేరు పురుషుడిది ఉంది. చిరు నామా బదిలీతో కొత్త ఓటరు కార్డు పోస్టు ద్వారా అందుకున్న సాంబశివరావు అనే ఓటరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దేందుకు గడువులేదని అధికారులు చెబుతున్నారు. తప్పులు దొర్లిన కార్డులతోనే ఓటరు ఓటు హక్కు విని యోగించుకునేందుకు పోలింగ్ బూత్‌లోకి వెళితే అభ్యంతరాలను ఎదుర్కోవలసి వస్తుందన్న ఆందోళన సదరు ఓటర్ల నుంచి వ్యక్తమవుతోంది.

విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి

● ఏడీఏ మస్తానమ్మ


నరసరావుపేటలో విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 3: విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్‌లోని విత్తనాల షాపుల్లో రెండో రోజు తనిఖీలలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి వ్యవసాయశాఖ ఏడీఏ ఏ మద్దిలేటి, ఏవో బీవీ సురేష్ రెడ్డి, ఏడీఏ పి మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య తదితరులు షాపులను తనిఖీచేశారు. తనిఖీలలో భవాని ఎంటర్‌ప్రైజెస్‌లో 5 కేజీలు, శ్రీమహాలక్ష్మి సీడ్స్ 444 కేజీలు, లక్ష్మీ ప్రియా సీడ్స్, 144 కేజీలు, మొత్తం 589 కేజీలు, మొత్తం విలువ రూ.1,73,900 అమ్మకం నిలుపుదల చేసినట్లు ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్ రైతుల సంతకంతో బిల్స్ ఇవ్వాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో విత్తనాలు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఏ మద్దిలేటి, ఏవో బీవీ సురేష్ రెడ్డి, ఏడీఏ పి మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య తదితరులు షాపులను తనిఖీ చేశారు.

విద్యుత్ తీగలు తగిలి తాపీ మేస్త్రికి గాయాలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 3: విద్యుత్ తీగలు తగిలి తాపీమేస్త్రికి గాయాలైన సంఘటన పట్టణంలోని గాయత్రినగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వెంకుపాలెం గ్రామానికి చెందిన, సాతులూరి మాణిక్యాలరావు గాయత్రీనగర్‌లోని నూతన భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలుతగిలి గాయాలయ్యాయి. మాణిక్యాలరావును ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు, కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మెక్సెల్ టెక్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న జోసిల్ ఇండస్ట్రీ మేనేజర్ జాన్‌బాషా తదితరులు

జేఎన్‌టీయూలో మెక్సెల్ టూకే టెక్ ఫెస్ట్ విజయవంతం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: స్థానిక జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాలలో బుధవారం నిర్వహించిన మెక్సెల్ టూకే 24టెక్ ఫెస్ట్ విజయవంతం అయింది. ముఖ్యఅతిథిగా హాజరైన జోసిల్ ఇండస్ట్రీ మేనేజర్ జాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు చదవడం ద్వారా 30శాతం నేర్చుకుంటారన్నారు. అనుభవం ద్వారా 35శాతం, సమాజం నుంచి మిగతాది నేర్చుకొని పిల్లలు ఉద్యోగవుతారన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మెకానికల్ డిపార్టుమెంట్‌లో కష్టపడి చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు త్వరగా వస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు మాట్లాడుతూ మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ నాలెడ్జ్‌తో కలసి చదివినట్లయితే విజయవంతం అవుతారన్నారు. మెకానికల్ అధిపతి ఐఎస్ ఫణిసుష్మ మాట్లాడుతూ మెకానికల్ చదివిన వాళ్ళకి ఈ మధ్యకాలంలో ఐదుగురికి కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. కో ఆర్డినేటర్ డాక్టర్ జి సులోచన, బాలాజీ మాట్లాడుతూ మెకానికల్ డిపార్టుమెంట్‌లో టెక్‌ఫెస్ట్ జరిగినప్పుడు ఈవెంట్స్ ఇంజిన్ అసెంబ్లీ, డీఅసెంబ్లింగ్ ప్రాముఖ్యం తెలియజేశామన్నారు. మెక్సెల్ టెక్‌ఫెస్ట్‌లో వివిధ కళాశాలలకు చెందిన మెకానికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అనుబంధ సంస్థ అయిన ఎనోరా ఫార్మా ప్రొడక్షన్, ఫార్ములేషన్ డిపార్టుమెంట్‌కి సంబంధించి ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. ప్రాంగణ ఎంపికలు ఆపరేషన్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బీ శ్రీధర్‌రెడ్డి, హ్యూమన్ రిసోర్స్ డిపార్టుమెంట్ మాడపాటి ప్రవీణ్‌కుమార్ నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలలో 36మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3లక్షలు వేతనం అందజేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ చందన అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో ఫేర్వెల్‌డే

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో ఫైనల్ ఇయర్ డిప్లమో వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి అన్నారు. కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డిప్లమో పూర్తిచేసుకొని ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు తమ కళాశాలలో మంచి విద్యాఅవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బార్గవ్‌భూషన్, డీన్ లక్ష్మీ సురేఖ, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పింఛన్లపై జగన్‌రెడ్డి రాజకీయాలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 3: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వలంటీర్లతో వైసీపీ ప్రభుత్వం బలవంతపు రాజీనామాలు చేయిస్తూ రాజకీయం చేస్తుందని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకప్రాంతాల్లో భారీగా నమోదవుతున్న వలంటీర్ల రాజీనామాలు వైసీపీ కుట్రలో భాగమేనన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 34వ వార్డులోని వర్ష అపార్ట్‌మెంట్, 35వ వార్డులోని సాయి అపార్ట్‌మెంట్ వాసులతో ప్రత్తిపాటి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో జగన్‌రెడ్డి గ్యాంగ్ అన్ని అడ్డదారులు తొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. మంచిచేశానని నమ్మితేనే ఓటు వేయండి అని అడుగుతున్న వ్యక్తి వలంటీర్ల విషయంలో ఇన్ని కుయుక్తులు ఎందుకు పన్నుతున్నారో చెప్పాలని నిలదీశారు. ధైర్యం ఉంటే వలంటీర్లు, పోలీసుల ప్రమేయం లేకుండా ఎన్నికలకు సిద్ధపడాలని ప్రత్తిపాటి సవాల్ విసిరారు. అనంతరం సూపర్-6 పథకాల గురించి వివరించి భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు తెస్తామని, రోడ్లు, డ్రైయినేజ్, తాగునీటి సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని, రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు నాయకత్వం అవసరమని, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 3: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఓటమిభయంలో కూరుకుపోతున్న వైసీపీ నాయకులు కూటమిలో చిచ్చు పెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలపై అంతా అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వరకు విజయం సాధించి తీరాలన్న సంకల్పం, సమరోత్సాహం, సంయమనం మూడు సూత్రాలుగా పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం చిలకలూరిపేట నియోజకవర్గంలో పలు మండలాల నుంచి వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. యడ్లపాడు మండలం తిమ్మాపురంనకు చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. సర్పంచ్ పుల్లగూర భారతి ఆధ్వర్యంలో వారంతా టీడీపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రత్తిపాటి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏ పరిస్థితుల్లోనైనా మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతోనే సాగాలని, లేనిపోని విభేదాలు సృష్టించటం కోసం వివిధ రూపాల్లో జగన్ చేసే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేదు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3: కనీసం పెన్షన్ ఇవ్వడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేటలో టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ బడ్జెట్ లేనికారణంగా ప్రతిపక్షం మీద నెపం మోపి టీడీపీ, జనసేన, బీజేపీ వాళ్ల పింఛను ఇవ్వనీయకుండా చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ వలంటీర్లు పెన్షన్ ఇవ్వడానికి వీలులేదని చెప్పారన్నారు. పింఛను ఇవ్వటానికి పంచాతీయ సెక్రటరీలు ఉన్నారని, ప్రతి గ్రామంలో పింఛను ఇవ్వడానికి అవకాశం ఉంది కాబట్టి పింఛను ఇవ్వాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి బడ్జెట్ లేక, అప్పులు రానికారణంగా ప్రభుత్వం పెన్షన్ ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతి, దుర్మార్గం, అక్రమఆస్తులు కూడపెట్టుకోవడంతో ఐదేళ్ల సరిపోయిందన్నారు. ఇవాళ ప్రజలందరూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూర్తిగా అవినీతి, దుర్మార్గాలు, అక్రమాస్తులలో కూరుకుపోయాడన్నారు. అధికారబలం, డబ్బుతో గెలవాలని ప్రయత్నం చేస్తున్నాడని, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఓడించడానికి నరసరావుపేట నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మ్యానిఫెస్టోను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోడీలు వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా అడుగంటిపోయిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి, వ్యవస్థలను బాగుచేయడానికి కలిసి ప్రయాణం చేస్తున్నారన్నారు. వైసీపీని గద్దెదించడానికి మూడు పార్టీలు ఉమ్మడి ప్రణాళికతో ముందుకు వెళుతున్నాయన్నారు. చంద్రబాబునాయుడు దాదాపు రూ.2వేల కోట్లతో పట్టిసీమను పూర్తిచేస్తే కృష్ణాడెల్టా అంతా సశ్యశ్యామం అయిందన్నారు. అదేవిధంగా జగన్‌మోహన్‌రెడ్డి వరికపుడిశల ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే పల్నాడు జిల్లా అంతా ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యం గంజాయి, గుట్కా, మద్యం మాఫియాతో ఈ రాష్ట్రం మొత్తం నడుస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

● 6 వరకు పంపిణీ ● దివ్యాంగులు.. నడవలేని వారికి ఇంటి వద్దనే
● సచివాలయాల వద్ద టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు
● పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్ శివశంకర్


నరసరావుపేటలోని సచివాలయంలో పింఛన్ల కోసం వచ్చిన లబ్ధిదారులు

నరసరావుపేట, ఏప్రిల్ 3: జిల్లాలో పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. సచివాలయాల కార్యదర్శులకు సాయంత్రం మూడు గంటల తర్వాత బ్యాంకుల నుంచి నగదు అందజేశారు. 4గంటలకు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రాంభించారు. సాయంత్రం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని ముందుగా ప్రకటించిన కొందరు వైసీపీ నేతలు. వలంటీర్లుగా పనిచేసిన వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఇచ్చిన సమాచారంతో పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు వచ్చి వెనుతిరిగారు. పలు ప్రాంతాల్లోని సచివాలయాలకు పూర్తిస్థాయిలో పింఛన్ సొమ్ము విడుదల కాలేదు. కలెక్టర్ శివశంకర్ ఆదేశాలతో సచివాలయాల వద్ద పింఛన్‌దారుల కోసం తాగునీరు, కుర్చీలు, టెంట్ ఏర్పాటుచేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీని ఆయన పర్యవేక్షించారు. 6వ తేదీ వరకు జిల్లాలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఉదయం 6 నుంచి 10గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు ఎండ తీవ్రతలేని వేళల్లో పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. వీలైనంతవరకు సచివాలయానికి రాగలిగిన వారికి సచివాలయం వద్దనే పింఛన్లు అందచేయాలన్నారు. పింఛన్లు పంపిణీ ప్రక్రియలో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఎవరూ ఉండకూడదని, ఆధార్‌తో మాత్రమే పింఛన్ పంపిణీ చేయాలని, పింఛన్లకు సంబంధించిన కార్డులు ఉండకూడదన్న ఆదేశాలు జారీ అయ్యాయి. కొన్ని గ్రామాలు, పట్టణాల్లోని పలు వార్డుల పరిధిలో పూర్తిస్థాయిలో పింఛన్ సొమ్ము బ్యాంకులకు జమకాలేదు. లింగంగుంట్ల, ములకలూరు తదితర పంచాయతీల పరిధిలో సల్పంగా పింఛన్ సొమ్ము అందజేశారు. ఇదే పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. గురువారం పూర్తిస్థాయిలో పింఛన్ సొమ్ము పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

చిలకలూరిపేటలో 23 శాతం పింఛన్ల పంపిణీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 3: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. రాత్రి 8 గంటల సమయానికి 23శాతం మేరకు పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు మునిసిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తెలిపారు. సుమారు 2600 మందికి పింఛన్లు పంపిణీచేసినట్లు తెలిపారు. పట్టణంలో వివిధ రకాల పింఛన్లు తీసుకొనే వారి సంఖ్య 11,332గా ఉంది. వీరికి ప్రతి నెల రూ.3.42కోట్ల రూపాయల మొత్తాన్ని పింఛన్లుగా అందజేస్తున్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్ళి సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తారని తెలిపారు. వచ్చే మూడు రోజుల్లో లబ్ధిదారులందరికీ పింఛన్లు అందుతాయని అన్నారు. ఎవరైనా లబ్ధిదారులు సచివాలయాల వద్దకు వెళ్ళినా అక్కడ కూడా పింఛన్లు ఇచ్చే ఏర్పాటు చేశామని చెప్పారు.

శ్రీరామ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

శావల్యాపురం, ఏప్రిల్ 3: సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్ సౌజన్యంతో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై శావల్యాపురం కనకదుర్గమ్మ దేవాలయం వద్ద చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 ఏళ్ళుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల మైనారిటీసెల్ అధ్యక్షుడు మదార్, రెడ్డి జ్వాలానరసింహారావు, కె.లక్ష్మీనారాయణ, బి.వెంకటేశ్వర్లు, డి.వెంకయ్య పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండమెట్ల వద్ద అన్నదానం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 4: స్థానిక కొండ మెట్ల వద్ద వరసిద్ధి వినాయక దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన అడ్డగిరి తారక్‌ను ఆలయ భక్తబృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, అరవింద్, గుమ్మడి సదాశివరావు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, బి.సుబ్బారావు, కాకుమాను కోటేశ్వరరావు, కూచి రామాంజనేయులు, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

● వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు


గ్రామస్థులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్‌రావు

శావల్యాపురం, ఏప్రిల్ 3: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని వినుకొండ రూరల్‌సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని పిచికలపాలెం, చిన్న కంచెర్ల గ్రామాలలో కేంద్ర బలగాలతో బుధవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

అనంతరం గ్రామస్థులతో రూరల్‌సీఐ మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండరాదని, పోలింగ్ రోజున 144సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎస్ఐ చల్లా సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరించినా, ఏవైనా సమస్యలున్నా పోలీసులకు సమాచారం అందించాలని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని, యువకులు లేనిపోని గొడవల్లో తలదూర్చి జీవితాలు నాశనం చేసుకోవద్దని, నగదు, మద్యం పంపిణీలకు దూరంగా ఉండాలన్నారు.

ఇళ్ళ వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలి

వినుకొండ టౌన్, నూజెండ్ల ఏప్రిల్ 3: పింఛన్‌దారులకు ఇంటివద్దకే వెళ్లి గ్రామ సచివాలయం సిబ్బంది పింఛన్‌ను అందజేయాలంటూ పట్టణంలోని కొందరు టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయానికి అనుబంధంగా ఉన్న గ్రామాల్లోని లబ్ధిదారులకు వారి ఇళ్ళకు సచివాలయం సిబ్బంది వెళ్ళి పెన్షన్ అందజేయాలని టీడీపీ నాయకులు పత్తి పూర్ణ, టీడీపీ లీగల్ కమిటి అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, కౌన్సిలర్ పులినాగరాజు, చిన్నబాబు తదితరులు వినతిపత్రంలో కోరారు. వినుకొండ మండల టీడీపీ అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మక్కెన రమేష్, గోవిందరాజులు, బ్రహ్మం, కృష్ణారెడ్డి, మక్కెన వెంకటరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. సచివాలయాలు లేని గ్రామాల్లో లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే పింఛన్ అందజేయాలని ఎంపీడీవో వీరభద్రాచారికి టీడీపీ నాయకులు నూజెండ్ల మండల మీసాల మురళీకృష్ణ యాదవ్, ఎం.సుబ్బారావు, ఆర్.మల్లేశ్వరరావు, జి.బ్రహ్మయ్య, బత్తుల సుబ్బారావు, నాని, సర్పంచ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.



శావల్యాపురంలో స్వీప్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

● తహసీల్దార్ లక్ష్మీలావణ్య

శావల్యాపురం, ఏప్రిల్ 3: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని ఓటర్లంతా నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి జడ్పీ పాఠశాల వరకు అధికారులు స్వీప్ ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లంతా బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకొని మంచి నాయకుణిని ఎన్నుకొన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు ఇచ్చే నగదు, మద్యం, కానుకలకు తలొగ్గి ఓట్లేసి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటనాగరాజు, ఆర్ఐ నాసరయ్య, సర్వేయర్ నాగేశ్వరరావు, ఏఎస్ఓ చెన్నయ్య జూనియర్ అసిస్టెంట్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం

శావల్యాపురం, ఏప్రిల్ 3: పింఛన్ల నగదు బ్యాంకుల్లో జమచేయడంలో ప్రభుత్వం తీవ్రజాప్యం చేయడంతో ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ జరగక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం నగదు జమ అవ్వటంతో 3గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీని ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో జాప్యం చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. గ్రామాల్లో రెండు, మూడుచోట్ల పింఛన్ల పంపిణీ చేయవద్దంటూ సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడిచేశారు. కొన్ని సచివాలయల వద్ద కూర్చొని ఉన్న ఫించన్‌దారులను నిలబెట్టి ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఫించన్‌దారుల కష్టాలంటూ అసత్య ప్రచారాలు చేశారు.

60 శాతం పూర్తిచేశాం: ఎంపీడీవో

మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 60శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను బృందాలుగా విభజించి ప్రతి గ్రామంలో రెండు, మూడుచోట్ల పింఛన్లను పంపిణీ చేశామన్నారు. వృద్ధులకు, మహిళలు, వికలాంగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సచివాలయాల వద్ద తాగునీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. గురువారానికి నూరుశాతం పూర్తి చేసేందుకు ఉదయాన్నే పింఛన్ల పంపిణీ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇబ్బందులెదురైనా ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు చొరవతో 60శాతం పంపిణీని పూర్తి చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

యువకుడి హత్య కేసులో నలుగురి అరెస్టు

చిలకలూరిపేట, ఏప్రిల్ 3: చిలకలూరిపేట మండలం ఎద్దు ఏసుబాబు(41) అనే యువకుని మృతి కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు చేధించారు. నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ కథనం ప్రకారం ఈ యువకుడిని నలుగురు వ్యక్తులు కలసి హత్య చేసినట్టు తెలిపారు. అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని పేర్కొన్నారు. ఈ యువకుడిని మద్యం తాగించి హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. ఈ యువకుడి హత్యకు సంబంధించి అదేగ్రామానికి చెందిన నలుగురిని గుర్తించి అరెస్టు చేసినట్టు చెప్పారు. అరెస్టయిన వారిలో సూరబోయిన మురళీకృష్ణ, ఒంటరి ఏసుబాబు, సూరబోయిన రామకోటేశ్వరరావు, ఎద్దు రజిని ఉన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ కవికృష్ణ ఉన్నారు.


పార్టీలోకి చేరిన వారితో ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని 26వ వార్డులో అధికార వైసీపీకి చెందిన 30 కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ కృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.

జెడ్డావారిపాలెంలో శంఖారావం

నూజెండ్ల, ఏప్రిల్ 3: మండలంలోని జెడ్డావారిపాలెంలో నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులుకు మద్దతుగా ఆయన కుమారుడు హరీష్ సూపర్ - 6 పథకాలను తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ లగడపాటి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణయాదవ్, టీడీపీ నాయకులు జి.ఆంజనేయులు, ఆర్.వీరాంజనేయరెడ్డి, ఎల్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిజమైన నేస్తం చంద్రబాబు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న జీవీ, షరీఫ్

వినుకొండ, ఏప్రిల్ 3: రాష్ట్రంలో ముస్లిం, మైనారిటీలకు నిజమైన నేస్తం చంద్రబాబు మాత్రమేనని పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ముస్లిం, మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో వినుకొండలోని పెద్ద మసీదు వద్ద బుధవారం భారీస్థాయిలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీవీతో పాటు శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు. జీవీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రూ.3600కోట్లు ఖర్చు చేశారని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా చిరువ్యాపారులైన ముస్లింలకు రుణాలిచ్చి ఆదుకొన్నారని, ఇమామ్‌లు, మౌజంలకు పారితోషికాలను అందించారన్నారు. ముస్లిం ఆడపిల్లలకు వివాహ కానుకగా రూ.50వేలు, విదేశీ విద్యకు, సివిల్స్ శిక్షణకు తోడ్పాటునందించారన్నారు. ముస్లిం, మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడ్డ చంద్రబాబును నారా హమారా... టీడీపీ హమారా అంటూ ముస్లింలంతా గుండెల్లో పెట్టుకొన్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో పెట్టుకొన్న పొత్తును ముస్లింలంతా పెద్దమనసుతో అంగీకరించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటు హక్కు ప్రాముఖ్యంపై అవగాహన ర్యాలీ


ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుపుతూ జరిగిన ర్యాలీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 3: పట్టణంలోని ఏఎంజీ సంస్థ వద్ద నుంచి బుధవారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట సెంటర్, భాస్కర్ థియేటర్ సెంటర్ మీదుగా చౌత్రా సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మాట్లాడిన చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బీ నారద ముని పేర్కొన్నారు. భాస్కర్ థియేటర్ సెంటర్‌లో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్లకార్డులు చేతబూని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం జ్వాలానరసింహం, సీహెచ్ గోవిందరావు, షేక్ అఫ్రషున్నీసా బేగం, అర్బన్ ఎస్ఐ పుల్లారావు, యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల డిప్యూటీ తహసీల్దార్లు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజులకు చేరిన ఎస్‌వీ చారిటీ అన్నదానం


ఎస్‌వీ చారిటీ ఆధ్వర్యంలో చేస్తున్న అన్నదానం

బొల్లాపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌వీ చారిటీ అధినేత పోకా వెంకటరావు ఆధ్వర్యంలో బొల్లాపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమం బుధవారంతో వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పేదల ఆకలి తీరుస్తున్న ఎస్‌వీ చారిటీ మొబైల్ క్యాంటీన్ కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా పేదవాడి ఆకలి తీర్చటానికి నడుంబిగించి బుధవారంనకు వంద రోజులు పూర్తి చేసుకుదన్నారు. మిత్రులు, శ్రేయోభిలాషులు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఇకముందు కూడా అన్నదానం, విద్యాదానం, రక్తదానం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తామని వెంకటరావు తెలిపారు.